
ప్రతి నెలా ఉద్యోగ మేళా

ఉపాధి అవకాశాలపై విస్తృత ప్రచారం

ఈనాడు, సిరిసిల్ల



జిల్లాలో డిగ్రీ, ఆపై చదువులు చదివిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలనే ఆకాంక్ష ఎక్కువ ఉంటుంది. కానీ వాటిలో అందరికీ అవకాశాలు లభించకపోవచ్చు. జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పొరుగు సేవల్లో భర్తీ చేసే ఉద్యోగాలకు పదుల్లో ఖాళీలు ఉంటే వేలల్లో దరఖాస్తులు వస్తున్నాయి. యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా ప్రైవేటు రంగంలో, స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ పేర్కొన్నారు. జిల్లా యువతలో కార్పొరేట్ సంస్థల్లో పని చేసే నైపుణ్యాలు తక్కువగా ఉన్నాయి. అందుకే ప్రతి నెలా నిర్వహించే ఉద్యోగ మేళాలో పదిశాతం మంది కూడా ఉద్యోగాలను సొంతం చేసుకోలేకపోతున్నారు. జిల్లాలో ఉపాధికల్పన శాఖ ద్వారా నిరుద్యోగుల ఉద్యోగ అవకాశాలకు చేపడుతున్న చర్యలు, వారిలో నైపుణ్యాల పెంపు తదితర అంశాలను ఆయన 'ఈనాడు' ముఖాముఖిలో వివరించారు.

ప్ర: ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీ ఎలా ఉంది?

జ: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే 800 మంది పొరుగుసేవల ద్వారా ఉద్యోగాలు చేస్తున్నారు. గతేడాది వరకు జిల్లాకు ఒకే పొరుగు సేవల సంస్థ ద్వారానే నియామక ప్రక్రియ జరిగేది. ఇప్పుడు 25 సంస్థలు పొరుగు సేవల పద్ధతిలో పని చేస్తున్నాయి. ప్రభుత్వశాఖల్లోని ఖాళీలు, అవసరాలను బట్టి ఉత్తర్వులు జారీ చేస్తాం. విద్యార్హతలు, మెరిట్ జాబితా ప్రకారం నియామక ప్రక్రియ జరుగుతుంది. యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం నిరీక్షించకుండా ప్రైవేటు రంగాల్లోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

ప్ర: నైపుణ్యాభివృద్ధి శిక్షణ ప్రారంభమైందా?

జ: జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రత్యేకంగా ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. దీనిలో టాటా కంపెనీ భాగస్వామ్యంతో అడ్వాన్స్ టెక్నాలజీ స్కిల్స్‌లో ఆరు రకాల కోర్సుల రూపకల్పన జరిగింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని ప్రారంభించేలా ప్రణాళికలు చేస్తున్నాం.

ప్ర: యువత ముందుకొస్తున్నారా?

జ: జిల్లాలో ఉద్యోగ మేళా నిర్వహించే పది రోజుల ముందు నుంచే గ్రామాల వారీగా పోలీసు, ప్రభుత్వశాఖల సమన్వయంతో విస్తృత ప్రచారం కల్పిస్తున్నాం. ఇదివరకు ఉద్యోగ మేళాకు వచ్చిన వారు, కార్యాలయంలో సంప్రదించినవారి పేరును నమోదు చేసుకుంటున్నాం. మేళాకు వచ్చిన యువతలో చాలా మంది వేతనం తక్కువ అంటూ చేరడం లేదు. దీనికి సరైన నైపుణ్యాలు లేకపోవడమూ ఒక కారణం. ప్రతి నాలుగో శనివారం ఒక మండలంలో జరుగుతుంది. ఈ నెల వీర్నపల్లి మండలాన్ని ఎంపిక చేశాం.

ప్రశ్న: జిల్లాలో నిరుద్యోగులకు కల్పించే ఉపాధి అవకాశాలను వివరిస్తారా?

జవాబు: జిల్లాలో ప్రతి నెలా ఒక ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నాం. దీనిలో సగటున పదిహేను కంపెనీలు పాల్గొంటాయి. సగటున 200 మంది హాజరవుతున్నారు. మూడు నెలలకోసారి నిర్వహించే మెగా జాబ్‌మేళాలో 50 కంపెనీలు ఉంటాయి. వీటిలో ఎక్కువగా ఫార్మసీ, రియల్‌ఎస్టేట్, బీమా, సేల్స్, సెక్యూరిటీ కంపెనీలు ఉంటాయి. యువతలోని నైపుణ్యాల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ఈ ఏడాది ఇప్పటికే జరిగిన పది ఉద్యోగ మేళాల్లో 1,500 మంది వరకు పాల్గొన్నారు. వీరిలో పదిశాతం మంది మాత్రమే ఉద్యోగంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నెల 17న టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) కరీంనగర్‌లో ఉద్యోగ మేళాను నిర్వహిస్తోంది. దీనిలో విదేశాల్లో పని చేయాలనుకునే వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.

ప్ర: స్వయం ఉపాధి రంగాల్లో స్థిరపడాలనుకునే వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారా?

జ: రెండేళ్ల క్రితం వరకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద నిరుద్యోగులకు వివిధ రకాల స్వయం ఉపాధి రంగాల్లో శిక్షణనిచ్చేది. ప్రస్తుతం ఈ పథకాన్ని మార్చింది. దీని స్థానంలో మరో కొత్త శిక్షణ కార్యక్రమాన్ని తీసుకొస్తోంది. దీనిలో సుమారు 30 రకాల స్వయం ఉపాధి రంగాలపై శిక్షణ ఇవ్వనున్నారు.

పంచాయతీలకు ఊరట

న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం



కస్బెకట్కూర్ పంచాయతీ కార్యాలయం

సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కొన్ని నెలలుగా గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడం, అటు ప్రత్యేక పాలనలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో సౌకర్యాలు సమకూరక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ ప్రధానంగా పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి పనులు, ట్రాక్టర్ కిస్తీలు, సిబ్బంది వేతనాల కోసం గ్రామ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మొన్నటి వరకు సర్పంచులు సొంతంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది.

☛ అప్పులు చేసి మరీ పంచాయతీల నిర్వహణను కొనసాగిస్తున్నామని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు.

☛ పల్లెల్లో పరిస్థితి అధ్వానంగా ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేసింది.

☛ జిల్లాలో మొత్తం 255 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇటీవల మరో 5 గ్రామ పంచాయతీలను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 260కి చేరింది. ఆయా పంచాయతీల జనాభా ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది.

కేటాయింపులు ఇలా..	రూపాయల్లో
బహుళప్రయోజన కార్మికుల వేతనాలు	1,24,82,768
ట్రాక్టర్ కిస్తీ	19,85,553
విద్యుత్తు ఛార్జీలు	76,70,000
స్వచ్ఛదనం-పచ్చదనం	1,36,24,076

☛ జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రూ. 3,57,62,397 విడుదల చేయడంతో ఊరట లభించింది. బహుళ ప్రయోజన కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ కిస్తీలు, విద్యుత్తు బిల్లులకు నిధులు మంజూరయ్యాయి.

☛ పండగ ముందు రోజు నిధులు రావడంతో 1,034 మంది పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచుల పాలన ముగిసి ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు విడుదల కావడం ఇదే ప్రథమం.

కార్మికులకు వేతనాలు చెల్లించాం

రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు గత రెండు నెలలుగా జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ. 3,57,62,397 మంజూరు చేసింది. వెంటనే పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాం. ట్రాక్టర్ కిస్తీలు, విద్యుత్తు బకాయిలు కూడా వెంటనే మంజూరు చేస్తాం.

- శేషాద్రి, ఇన్‌ఛార్జి జిల్లా పంచాయతీ అధికారి

సూర్య, చంద్రుల వాహనాలపై స్వామివారి ఊరేగింపు

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమవారం నిత్య హోమం, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణ జరిగాయి. ఉదయం సూర్యవాహనంపై, సాయంత్రం రంగనాయక తిప్పోలంపై స్వామివారిని ఊరేగించారు. రాత్రి నిత్య హోమం, బలిహరణం, నివేదన, తీర్థప్రసాద వితరణ జరిగాయి. రాత్రి చంద్ర వాహనంపై స్వామివారిని పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మారుతీరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సూర్యవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

హర హర మహాదేవ... శంభోశంకర

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు కిటకిటలాడాయి. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. పరివార దేవతలను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, అధికారులు పర్యవేక్షణ చేశారు. దాదాపు 30 వేల మంది రాజన్నను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. బద్దిపోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ నెలకొంది.



ఆలయంలో వేచి ఉన్న భక్తులు

వనరులు పుష్కలం

పరిశ్రమల స్థాపనకు అనుకూలం

● ఉమ్మడి జిల్లాలో ఉపాధిపై ఆశలు

ఈనాడు, కరీంనగర్



రాష్ట్ర ప్రభుత్వం 24 భారీ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని ఇటీవల ప్రకటించడంతో.. వాటి స్థాపనకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అనుకూలమనే మాట అందరినోట వినిపిస్తోంది. ఇప్పటికే పారిశ్రామికంగా, వ్యాపారపరంగా ఉమ్మడి జిల్లాకు మంచి గుర్తింపు లభిస్తోంది. పైగా పరిశ్రమలశాఖ మంత్రి జిల్లాకు చెందినవారవడం అదనపు బలం. రవాణా, మార్కెటింగ్ కోసం రోడ్లు, రైలు మార్గాలు, నీటి వనరులు పుష్కలంగా ఉండటంతో నాలుగు జిల్లాల్లో పారిశ్రామిక వికాసం వెల్లివిరియాలనే ఆకాంక్ష క్రమంగా పెరుగుతోంది.


ఈ ప్రభుత్వంలోనైనా సాధ్యపడేనా..

గత ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల్ని ఏర్పాటు చేస్తామని.. జగిత్యాల జిల్లా వెల్గటూర్, సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి, గంభీరావుపేట, కరీంనగర్ గ్రామీణ మండలాల్లో పలు ప్రాంతాలను ఎంపికచేసి ప్రతిపాదనలు పంపినా.. అచరణలో సాధ్యపడలేదు. ప్రస్తుత ప్రభుత్వమూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికుల్ని ఆహ్వానిస్తోంది. ఇప్పటి వరకు 86,552 అనుమతి పొందగా.. మరో 15వేల దరఖాస్తులు ఈ వార్షిక సంవత్సరంలో అందే వీలుంది.

తోడ్పాటు అందిస్తూ..

● టీజీఐఐసీ ఆధ్వర్యంలో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పారిశ్రామికవాడలను గతంలోనే గుర్తించారు. వీటి పరిధిలో దాదాపుగా 3వేల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. కరీంనగర్‌లోని పద్మానగర్‌లాంటి చోట సౌకర్యాల్ని మెరుగుపరచాల్సి ఉంది.

● తోలు ఉత్పత్తి సముదాయాన్ని(లెదర్‌పార్క్) చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో ఏర్పాటు చేస్తామనే ప్రతిపాదన పదిహేనేళ్లుగా నానుతోంది. 135 ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచినా.. ఇప్పటికీ ఇక్కడ పురోగతి లేనే లేదు. ఇందులోని 100 ఎకరాల్లో బెటాలియన్ ఏర్పాటు చేశారు. మిగతా స్థలం అలాగే ఉంది. నాలుగు జిల్లాల్లో దాదాపుగా 64 పరిశ్రమలు గతంలో ప్రతిపాదనలు పెట్టుకున్న వాటి పునరుద్ధరణకు తోడ్పాటు అందాల్సి ఉంది.



ఘనమైన ఫలితాలు..

● 256 కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు, మరో 300కిపైగా గ్రానైట్ క్వారీలు ఏర్పాటైన జిల్లాలో వేలాదిమందికి ఉపాధిని అందిస్తోంది. రాష్ట్రానికి గనుల ద్వారా అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే ప్రాంతంగా పేరొచ్చింది.



● సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్) 2023-24లో 70.02 మెట్రిక్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసింది. ఇందులో గోదావరిఖని ప్రాంతంలోని కార్మికుల శ్రమ గణనీయంగా ప్రతి ఏడాది కనిపిస్తోంది.

ఎంఎస్‌ఎంఈ (ఉద్యం పోర్టల్‌లో నమోదు)

జిల్లా	ఉత్పత్తి	సేవారంగం	మొత్తం
కరీంనగర్	8,082	28,887	36,969
జగిత్యాల	4,861	14,997	19,858
పెద్దపల్లి	3,081	13,366	16,447
సిరిసిల్ల	3,557	9,721	13,278
మొత్తం	19,581	66,971	86,552

● రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) ఏటా 4.95 లక్షల టన్నుల యూరియా, 2.97 లోల టన్నుల అమ్మోనియా లక్ష్యంగా ఏర్పాటై ఫలితాల్నిస్తోంది. స్థానికులకు ఉపాధి మెరుగైంది.

● సిరిసిల్ల జిల్లా పెద్దూరు సమీపంలో 15 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్కులో కోట్లాది రూపాయల పనులతో ఉపాధి లభిస్తోంది. సూపర్‌హబ్‌గా పేరొందిన ఇక్కడి వస్త్రోత్పత్తికి మరింత తోడ్పాటు అందాలి.

విప్‌ను కలిసిన సిరిసిల్ల ఆసాములు


విప్ ఆది శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ సభ్యులు

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ సభ్యులు వేములవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గత 30 ఏళ్లుగా ఎదురుచూసిన నూలు బ్యాంకు కల నెరవేడంతో పాటు ప్రభుత్వం రూ.50 కోట్లు విడుదల చేయడం పట్ల ఆసాములు విప్‌తోపాటు మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ బాధ్యుడు కేకే మహేందర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని ఆసాములు పేర్కొన్నారు. విద్యుత్తు పాత బకాయిలు, నాలుగు మీటర్లకు రాయితీ తదితర విషయాలపై విప్ సానుకూలంగా స్పందించినట్లు ఆసాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజు, ఆడెపు సాగర్, సత్యనారాయణరెడ్డి, సుమన్, సదానందం, భాస్కర్, అశోక్, రమేశ్, ఎల్లయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

వేములవాడ పట్టణానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం, పట్టణ అధ్యక్షుడు సిద్దంశెట్టి వేణు సోమవారం సంఘ సభ్యులతో కలిసి విప్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి విప్ శుభాకాంక్షలు తెలిపారు.

మూలనపడ్డ శుద్ధజల యంత్ర పరికరాలు

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ప్రభుత్వం శుద్ధజల కేంద్రాన్ని సుమారు రూ. 3 లక్షలతో ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఓ గదిలో ఏర్పాటు చేసి స్థానికులకు రూ. 5లకే 20 లీటర్ల శుద్ధజలాన్ని అందించారు. ప్రజల సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. పరికరాలు పూర్తిగా చెడిపోవడంతో వాటిని గ్రామ పంచాయతీ కార్యాలయ భవనంలో ఓ మూలన పడేశారు. దీంతో ప్రజాధనం వృథాగా మారింది. గ్రామంలోని ప్రైవేటు శుద్ధజల కేంద్రాల్లో ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట



అర్జీ ఇచ్చాం.. ఆదుకోండి


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు అర్జీదారులు తరలివచ్చి జిల్లా యంత్రాంగానికి వినతిపత్రాలను అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సిరిసిల్ల ఆర్డీవో రమేశ్‌కుమార్‌లు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 50 దరఖాస్తులు రాగా వాటిని సంబంధిత అధికారులకు అందజేశారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

గృహజ్యోతి అమలు కాలేదు



నేను ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేశాను. దరఖాస్తు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పథకం వర్తించలేదు. నేను మున్సిపల్ అధికారులకు దరఖాస్తు ఇస్తే మీటరు నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదని చెబుతున్నారు. నా మీటరు నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పథకం వర్తించే విధంగా చూడాలి.

- షేక్ రిహన బీ, సుభాష్‌నగర్, సిరిసిల్ల

అనుమతులు రద్దు చేయండి



మా గ్రామంలో ఎల్లమ్మ గుడివద్ద జనావాసాలకు దగ్గరగా సెల్‌ఫోన్ టవర్ నిర్మిస్తున్నారు. దానిని మేము అడ్డుకున్నాం. టవర్ వల్ల రేడియేషన్ వచ్చి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. గ్రామంలోని గౌడ వర్గీయులు నిర్మాణం కోసం తవ్వకాలు చేస్తున్నారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలి. - ఎల్లవ్వ, రేణుక, రమ్య తదితరులు, మల్కపేట, కోనరావుపేట మండలం


భవనానికి స్థలం ఇప్పించండి



మా కాలనీలో 40 మాల కుటుంబాలు ఉన్నాయి. మాకు సామాజిక భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని గతంలో అధికారులకు దరఖాస్తు చేశాం. అయినా ఇప్పటి వరకు కేటాయించలేదు. భవన నిర్మాణానికి స్థలం ఇప్పించగలరు.

- చెర్ల రాజమల్లు, చింతల్‌ఠాణా ఆర్‌అండ్ఆర్ కాలనీ

ఇతరులకు ఇచ్చిన పట్టాలను తొలగించండి



మేం నిరుపేద దళితులం. గ్రామ శివారులో గత ప్రభుత్వం హయాంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 17 ఎకరాలు కొనుగోలు చేశాం. మాకు కేటాయించిన భూమిలో సాగు చేసుకుంటున్నాం. దీనిలో 504 సర్వే నంబరులో ఉన్న 8 ఎకరాల 24 గుంటల నుంచి ఇతర వర్గానికి చెందిన 9 మందికి ఒక్కొక్కరికి 20 గుంటల చొప్పున కేటాయిస్తూ పట్టాలు ఇచ్చినట్లు వారు చూపిస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఆ వివరాలు ఇరువురి పేరున నమోదు కావడంతో మాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మా భూముల నుంచి ఇతరులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసి మాకు న్యాయం చేయాలి.

- ఎడ్ల మల్లయ్య, గోపాల్‌రావుపల్లె, తంగళ్లపల్లి మండలం


బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

బాధితులకు న్యాయం చేయడానికి చర్యలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. వెంటనే ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. భూ, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉల్లి సాగు.. జాగ్రత్తలతో మేలు

న్యూస్‌టుడే, జమ్మికుంట





ఉల్లి సాగు

నిత్యం తీసుకునే ఆహార పదార్థాల తయారీలో ఉల్లి వినియోగం తప్పనిసరిగా ఉంటుంది. ఆరోగ్యరీత్యా మేలు చేసే ఉల్లిని రాష్ట్రవ్యాప్తంగా 70 వేల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. యాసంగి సీజన్‌కుగాను అక్టోబరు నుంచి ఉల్లిని సాగు చేసుకోవచ్చు. రైతులు మొదటి నుంచి మెలకువలు పాటిస్తే లాభాలు ఉంటాయని **జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త జి. వేణుగోపాల్** చెబుతున్నారు.

ప్రతీ అడుగు కీలకమే..

ఉల్లిని వానాకాలం, యాసంగి, వేసవి.. ఇలా మూడు కాలాల్లో సాగు చేయవచ్చు. యాసంగి సాగును అక్టోబరు నుంచి డిసెంబరు వరకు చేపడతారు. ఎకరానికి 130 క్వింటాళ్ల నుంచి 160 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. విత్తనాలను నాటుకునే ముందు కిలో విత్తనానికి 8 గ్రాముల ట్రైకోడెర్మావిరడి కలిపి లేదా 3 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ వినియోగించి విత్తన శుద్ధి చేసుకోవచ్చు. ముందుగా నారు మళ్లపై సన్నని గీతలు వేసుకొని వరుసలో విత్తనాలు వేసుకొని మట్టితో కలపాలి. నారుకుళ్లు తెగులు నుంచి పైరు కాపాడుకునేందుకు 10 రోజులకోసారి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మడులను తడపాలి. రసం పీల్చే పురుగులు నష్టాన్ని కలిగిస్తాయి. ఆకుల అడుగు భాగంలో తెల్లమచ్చలు (మజ్జిగ తెగులు) ఏర్పడుతాయి. నివారణకు లీటరు నీటికి 2.మి.లీ. డైమిథోయేట్ కలిపి పిచికారీ చేయాలి.

విత్తుకునే పద్ధతి

ఎకరం విస్తీర్ణంలో సాగుకు 3 కిలోల నుంచి 4 కిలోల విత్తనాలు అవసరం. నారు పెంపకానికి ఎత్తైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. పలువురు రైతులు సమతల మడుల్లో నారు పెంచుతున్నారు. దీంతో మురుగు వెళ్లే పరిస్థితి లేక నారుకు తెగులు సోకి చివరకు సరిపడ నారు లేక ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. సమస్యను అధిగమించేందుకు ఎంచుకున్న పొలాన్ని 3 నుంచి నాలుగు సార్లు దున్నుకోవాలి. ఒక్కో నారుమడి 1 మీటరు వెడల్పు, 3 మీటర్ల పొడవు 15 సెం.మీ ఎత్తు ఉండేలా ఎత్తు మడులను ఏర్పాటు చేసుకోవాలి. 2 మడుల మధ్య అడుగు దూరం ఉండేలా చేసుకుంటే నడుస్తూ సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా ఉంటుంది. 50శాతం నీడనిచ్చే షేడ్ నెట్‌లను ఉపయోగిస్తే మొలక శాతం బాగుంటుంది.

రైతేరాజు

విత్తనాల్లో రకాలు

- రైతులు ఎరుపు, తెలుపు వర్ణాల ఉల్లి సాగుకు విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు.
- ఎరువు వర్ణం ఉల్లి విత్తనాల రకాల్లో బళ్లారి రెడ్, రాంపూర్ రెడ్, నాసిక్‌రెడ్, అగ్రిఫౌండ్ లైట్ రెడ్, పూసాలరెడ్, అర్కానికేతన్, అర్కా కల్యాణ్, అర్కా ప్రగతి, ఎన్-53లను ఎంపిక చేసుకోవచ్చు.
- తెలుపు వర్ణంలో పూసా వైట్ రౌండ్, పూసా వైట్ ఫ్లాట్ రకాలు అనుకూలం. ప్రైవేటు హైబ్రీడ్స్‌లో సెమినిస్ ఎక్స్‌పీహెచ్‌వో ఎస్-3, తయోవైట్ తదితర రకాలు ప్రాచుర్యం పొందాయి.

విరులు.. లాభాల సిరులు

న్యూస్‌టుడే, కమాన్‌పూర్



బంతి తోటలో రాజమల్లు దంపతులు

మూస ధోరణి పద్ధతిలో పంటలను సాగు చేయకుండా విభిన్నంగా కొంతమంది రైతులు ఆలోచిస్తున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకుంటూ సాగులో రాణిస్తున్నారు. ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్‌కు చెందిన రైతు మూగ రాజమల్లు తనకున్న 1.10 గుంటల భూమిలో బంతి పంటను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. 30 ఏళ్లుగా బంతి పంట సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎకరాకు రూ. 4 లక్షల ఆదాయం జూన్-జులై, అక్టోబరు-నవంబరు మాసాల్లో బంతి పంటను సాగు చేపడతారు. ఎకరాకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. ఎకరాకు గతేడాది 72 క్వింటాళ్ల దిగుబడి (ఒక పంటకు) సాధించినట్లు రైతు తెలిపారు. క్వింటాకు రూ.4,000-4,500 వరకు మార్కెట్ ధర ఆధారంగా విక్రయిస్తారు. ఖర్చులుపోను ఎకరాకు రూ.2 లక్షలు, ఏడాదికి రెండు పంటలకు కలిపి రూ.4 లక్షలకుపైగా ఆదాయం పొందుతున్నారు. పండగలకు విడిగా కిలో రూ.80-100 వరకు అమ్ముతున్నారు.

సాగు ఇలా..: మొక్కలు నాటిన 100 రోజుల్లో బంతి పూలు కోయొచ్చు. సాగుకు కావాల్సిన విత్తనాలను కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి తీసుకు వస్తున్నారు. ఎకరాకు సుమారు 8 వేల మొక్కలు నాటుతారు. దుక్కుల నాటి నుంచి సస్యరక్షణ చర్యలు చేపడుతూ.. పంట కలుపు, పురుగు మందులు ఆశించకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకొని ఏడాదిలో రెండుసార్లు సాగు చేస్తున్నారు.

పండ్ల తోటలకు ఏ నేలలు అనుకూలం?

మీకు తెలుసా?

పండ్ల తోటల సాగుకు అనువైన నేలలు, నీటివసతిగల వాటినే సాగుకు ఎన్నుకోవాలి. లోతైన ఎర్రగరప నేలలు, బాగా నీరింకే ఒండ్రునేలలు, మధ్యతరహా నల్లనేలలు, చెల్కా నేలలు పండ్లతోటల సాగుకు శ్రేష్ఠమైనవి. సారవంతమైన మట్టిగల నేలలోతు కనీసం 5 అడుగులు ఉండాలి. మొదటి 5 అడుగుల్లో రాతిచట్టు, సున్నపురాయి తగలకూడదు. అన్ని సీజన్లలోనూ సగటు భూగర్భ జలమట్టం 6 అడుగుల దిగువనే ఉండాలి. బంకమన్ను 40 శాతానికి మించి, సున్నం 10 శాతానికి మించి ఉండరాదు- **న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం**

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

? వరి ముదురాకు చివరలో మధ్య ఈనెకు ఇరు పక్కల మచ్చలు కనబడుతున్నాయి. ఏం చేయాలి?

- ఈ.రమేశ్, వెంకట్రావ్‌పల్లి

✓ జింకు లోపం కారణం. లీటరు నీటికి 2 గ్రాముల జింకు సల్ఫేట్ కలిపి 5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.



జె.విజయ్, జమ్మికుంట కేవీకే

? పత్తిలో పూత, పిందెలు, కాయలు రాలుతున్నాయి. నివారణ ఎలా? –తిరుపతి, మొగిలిపాలెం

✓ ప్లానోఫిక్స్ ద్రావణాన్ని 5 లీటర్ల నీటికి 1 మి.లీ. వంతున కలిపి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. – న్యూస్‌టుడే, జమ్మికుంట

సామాజిక సేవ.. సాహసాలకు తోవ

పర్వతారోహణకు ఎంపికైన క్యాడెట్లు

న్యూస్‌టుడే, కరీంనగర్ కలెక్టరేట్



గతేడాది పర్వతాన్ని అధిరోహించిన విద్యార్థులు

విద్యార్థుల్లో చదువుతోపాటు క్రీడా నైపుణ్యాలు, సేవాభావం, దేశభక్తి పెంపొందించాలి. అప్పుడే వారిలో దాగి ఉన్న ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది.. వారి జీవితానికి బాటలు పరచుకుంటాయి. పాఠశాలలు, కళాశాలల్లో భారత సాయుధ దళాల యువ విభాగం నేషనల్ క్యాడెట్ కార్ప్ (ఎన్‌సీసీ), జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లు విద్యార్థుల ఉన్నతికి దోహదపడుతున్నాయి. విద్యార్థులకు పలు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వారిలో సమాజ దృక్పథాన్ని పెంపొందిస్తున్నాయి. అందులో ఒకటి పర్వతారోహణ శిబిరం. శాతవాహన విశ్వవిద్యాలయ విద్యార్థులు మరో వారం రోజుల్లో ఆ శిబిరానికి వెళ్లనున్న నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

22 నుంచి పది రోజులపాటు శిబిరం

శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 10 మంది చురుకైన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఎంపిక చేశారు. వారిని ఈనెల 22 నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో నిర్వహించే అటల్ బిహారీ వాజ్‌పేయీ మౌంటెనింగ్ అండ్ అడ్వెంచర్ శిబిరానికి తీసుకెళ్లనున్నారు. ఈ శిబిరంలో విద్యార్థులు మైనస్ డిగ్రీల సెల్సియస్ వాతావరణంలో ఉండాల్సి ఉంటుంది. పర్వతారోహణ, తాడు సహాయంతో లోయలు దాటడం, పర్వతాలు, కొండల్లో ప్రమాదాలు జరిగితే బాధితులను తరలించటం, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు సేవా కార్యక్రమాలు చేయడం తదితర అంశాలపై పది రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. గుడారాలు ఏర్పాటు చేసుకొని అందులోనే ఉంటూ వాలంటీర్లు ఈ శిక్షణలో పాల్గొననున్నారు.

మలావత్ పూర్ణే ప్రేరణ



మాది సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం బడితండా. పదో తరగతి స్వగ్రామంలో, ఇంటర్ రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాను. చిన్నతనంలో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ ప్రేరణతో ట్రెక్కింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. ఇప్పుడు అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది.

- మాలోత్ అనిల్, బీకాం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానం



జగిత్యాలలోని ధూంపేట గ్రామం మాది. నాన్న మోహన్‌రెడ్డి గల్ఫ్ కార్మికుడు. అమ్మ వ్యవసాయం చేస్తుంది. సెలవు రోజుల్లో నేను కూడా పొలం పనులకు వెళ్తుంటాను. కళాశాలలో చదువుతూనే ఎన్ఎస్ఎస్‌లో చేరి సేవాభావం ఆకళింపు చేసుకున్నా. వాలంటీర్‌గా విశ్వవిద్యాలయం స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచా. శిబిరంలో పాల్గొనేందుకు ఉత్సుకతతో ఎదురుచూస్తున్నా.

- ఏ.అనూష, ఎస్‌కెఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల, జగిత్యాల

కోచ్ మాటలతో స్ఫూర్తి పొందా..



మాది సిరిసిల్ల జిల్లాలోని పొత్యాల గ్రామం. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తారు. ఎన్ఎస్ఎస్ కోచ్ వాణిశ్రీ మేడం మాటలతో స్ఫూర్తి పొందాను. ఎన్ఎస్ఎస్ క్యాడెట్ల ఎంపిక పోటీల్లో విశ్వవిద్యాలయం స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పటి నుంచో పర్వతారోహణ చేయాలని అనుకునేదాన్ని. ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. సద్వినియోగం చేసుకుంటాను. **- ఆర్.సంధ్య, బీఏ, టీటీడబ్ల్యూఆర్‌డీసీ(మహిళా), రాజన్న సిరిసిల్ల జిల్లా**


ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా



చదువుతోపాటు, ఆటలు, వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. విశ్వవిద్యాలయం స్థాయిలో నిర్వహించిన ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాను. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నా. త్వరగా శిబిరానికి వెళ్లి మంచు పర్వతాలను ఎక్కేయ్యాలని ఉంది.

- కె.తులసిదాస్, బీఏ, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

విద్యార్థుల్లో సేవాభావం పెంపు



ఈ శిబిరానికి బృంద నాయకుడిగా వ్యవహరిస్తున్నాను. ఈ సాహస శిబిరంతో విద్యార్థుల్లో సేవాభావం అలవడుతుంది. ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా స్పందించాలో తెలుస్తుంది. ధైర్యసాహసాలు పెంపొందుతాయి. జీవితంలో కష్టాలను ఎలా ఎదుర్కోవాలో అవగాహన ఏర్పడుతుంది. పలువురికి సహాయం చేయాలనే దృక్పథం అలవడుతుంది. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవటంతోపాటు దేశసేవలో ముందు వరుసలో ఉంటారు.

- పడాల తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, వృక్షశాస్త్రం, ఎస్సారార్ కళాశాల, కరీంనగర్

ఎల్ఎల్ఎం పరీక్ష ఫలితాల విడుదల

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గత ఆగస్టు నెలలో నిర్వహించిన ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డా.శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు వెబ్‌సైట్ www.satavahana.ac.in లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

నలుగురు అటవీశాఖ అధికారులపై వేటు

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజర్ బి.అరుణ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురిపై వేటుపడింది. ఈనెల 11న అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మైసమ్మ పూజ పేరుతో మందు విందు చేసుకోగా పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు డిప్యూటీ రేంజర్‌ను సస్పెండ్ చేస్తూ బాసర సర్కిల్ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ సి.సరవనన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొండగట్టు బీట్ అధికారి సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ లక్ష్మణ్, వాచర్ రహీంను జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్ విధుల్లోంచి తొలగించారు. మొత్తం నలుగురిపై చర్యలు తీసుకోగా పరారైన ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారి రాజశేఖర్, ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారి రవీందర్ సంఘటనపై పూర్తి విచారణ చేస్తున్నారు.

పత్తి గరిష్ఠ ధర రూ.6,960

జమ్మికుంట : నాలుగు రోజుల సెలవుల అనంతరం సోమవారం జమ్మికుంట మార్కెట్‌కు తక్కువగా పత్తి విక్రయానికి వచ్చింది. కేవలం 14 ట్రాలీల కొత్త విడిపత్తి మార్కెట్‌కు రాగా బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,200 గరిష్ఠంగా రూ.6,960 ధర పలికింది. 7 క్వింటాళ్ల బస్తాల పత్తిని రూ.6,300 నుంచి రూ.6,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

ఇద్దరు యువకుల దుర్మరణం



విక్కుర్తి దిలీప్ సూర అనిల్

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: అతి వేగంతో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విక్కుర్తి దిలీప్ (22), సూర అనిల్ (21) అనే ఇద్దరు స్నేహితులు. గ్రామంలో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన వేడుకల్లో రాత్రి వరకు సంతోషంగా గడిపారు. నిమజ్జనం అనంతరం దిలీప్ కొనుగోలు చేసిన నూతన ద్విచక్ర వాహనంపై సరదాగా కోనరావుపేట మండలం మామిడిపల్లి వైపు వెళ్లారు. అతివేగంగా వెళ్తున్న వీరి వాహనం హన్మాజీపేట శివారులో మూలమలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చున్న సూర అనిల్ అక్కడికక్కడే మృతి చెందగా, వాహనం నడుపుతున్న దిలీప్ తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న పెట్రోలింగ్ పోలీసులు గమనించి దిలీప్‌ని వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. డిగ్రీ పూర్తి చేసిన దిలీప్ హైదరాబాద్‌లో ఉద్యోగాన్వేషణలో ఉండగా దసరా పండగకు ఇంటికి వచ్చాడు. అనిల్ ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం చేస్తుండేవాడు. కేసు నమోదు చేసిన రూరల్ ఎస్సై మారుతి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దిలీప్ తండ్రి రాజేశం గల్ఫ్ వెళ్లగా తల్లి జూలి అంగన్‌వాడీ టీచర్. అనిల్ తండ్రి అంజయ్య గల్ఫ్ వెళ్లగా తల్లి లక్ష్మి వ్యవసాయం చేస్తుంది. కొత్త బండి మోజు తీరకముందే వెళ్లిపోయావా బిడ్డా అంటూ తల్లి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?

న్యూస్‌టుడే, వేములవాడ

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది.

వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు.

ప్రకటించిన ప్రోత్సాహక నగదు వివరాలు

సంవత్సరం	ప్రకటించిన ప్రోత్సాహకం (రూ.లక్షల్లో)
2021-22	7
2022-23	7
2023-24	15

మూడేళ్లుగా 'కాయకల్ప'కు ప్రాంతీయ ఆసుపత్రి ఎంపిక



వేములవాడ ఏరియా ఆసుపత్రి

- సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర, ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భ సంచిలో గడ్డల తొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూ జరుగుతుంటాయి.
- సెప్టెంబరు 6న 24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు.
- ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది.

ఆసుపత్రి అభివృద్ధికి ఉపయోగపడతాయి

ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది.

– సంతోష్‌చారి, పర్యవేక్షకుడు, వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి

ఎంపిక విధానం ఇలా...

కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు.

- ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారంగా అవార్డుకు ఎంపిక చేస్తారు.
- వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని జులై 26న రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.
- అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది.
- మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

వికటించిన వ్యాక్సిన్

- రెండుసార్లు శస్త్రచికిత్స చేయించుకున్నా మెరుగుపడని ఆరోగ్యం
- మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు బాధితుల ఫిర్యాదు



వ్యాక్సిన్ వేసిన చోట ఏర్పడిన పుండు



బాధితులు చంద్రశేఖర్, రాకేశ్, రంజిత్‌కుమార్

కోరుట్ల, న్యూస్‌టుడే: గల్ఫ్ వెళ్లే క్రమంలో వైద్య పరీక్షల్లో భాగంగా వ్యాక్సిన్ వేయించుకోగా చేతికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాని పరిస్థితి నెలకొందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. . జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, మరో యువకుడు, మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన రాకేశ్ సౌదీ అరేబియా, బెహ్రెయిన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చంద్రశేఖర్‌కు సౌదీ వీసా రావడంతో నాలుగు నెలల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షల్లో భాగంగా కుడి చేతికి వ్యాక్సిన్ ఇచ్చారు. 20 రోజుల తర్వాత వ్యాక్సిన్ తీసుకున్న చోట గడ్డ ఏర్పడగా తగ్గిపోతుందని సౌదీ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పనిలో చేరాడు. తర్వాత కొద్దిరోజులకు వ్యాక్సిన్ తీసుకున్న చోట పుండు కావడంతో ఆసుపత్రికి వెళ్లినా నయం కాకపోగా శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. ఇండియాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కంపెనీ నిర్వాహకులను కోరగా అనుమతి ఇవ్వలేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఇండియా ఎంబసీలో దరఖాస్తు చేసుకున్నా పంపించలేదు. 5 వేల సౌదీ రియాల్‌లు తీసుకొని పంపించారు. 40 రోజుల కిందట సంగెంకు చేరుకున్న చంద్రశేఖర్ కోరుట్ల ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపాడు. సంగెంకు చెందిన రంజిత్‌కుమార్ బహ్రెయిన్‌కు, మోహన్‌రావుపేటకు చెందిన రాకేశ్ సౌదీ వెళ్లేందుకు జూన్ చివర్లో హైదరాబాద్‌లోని అదే మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలు చేయిచుకోగా వీరికి కూడా వ్యాక్సిన్ ఇచ్చారు. రెండు నెలల తర్వాత వ్యాక్సిన్ తీసుకున్న చోట ఇన్‌ఫెక్షన్‌సోకి గడ్డలాగా తయారైంది. వెంటనే కోరుట్లలోని ఆసుపత్రిలో చేరి శస్త్రచికిత్స చేయించుకోగా నయమైంది. దీంతో వీరు గల్ఫ్ వెళ్లకుండా ఇంటి వద్దే ఉండిపోయారు. రెండు వారాల కిందట శస్త్రచికిత్స చేసిన చోట మరోమారు నొప్పి రావడంతో వైద్యులను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు ఇన్‌ఫెక్షన్ పూర్తిగా తగ్గిపోలేదని మరోమారు శస్త్రచికిత్స చేయాలని సూచించడంతో వారం రోజుల కిందట రెండోసారి సర్జరీ చేయించుకున్నారు. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లాలని ఆశపడితే మెడికల్ సెంటర్‌లో ఇచ్చిన వ్యాక్సిన్‌తో అనారోగ్యానికి గురై వెళ్లలేకపోయామని వాపోయారు. సోమవారం బాధితులు చంద్రశేఖర్, రంజిత్‌కుమార్, రాకేశ్ సదరు మెడికల్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదని తెలిపారు. సంబంధిత మెడికల్ సెంటర్ ఉన్న ప్రాంతంలోనే ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించినట్లు బాధితులు వాపోయారు. ఈవిషయమై సీఐ సురేశ్‌బాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. వ్యాక్సిన్ తీసుకున్న మెడికల్ సెంటర్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించామన్నారు. అక్కడే ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించినట్లు పేర్కొన్నారు.

నిధులున్నా రహదారి నిర్మాణంలో నిర్లక్ష్యం



చొప్పదండి మండలంలోని ఆర్నకొండ నుంచి గోపాల్‌రావుపేట వరకు రహదారి గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.1.98 కోట్ల నిధులు 2022లో మంజూరు చేశారు. కానీ గుత్తేదారు నేటికీ నిర్మించలేదు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్రప్రసాద్‌ను వివరణ కోరగా.. రహదారి పనులు త్వరలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, చొప్పదండి

దసరాకు..

మత్తు ఎక్కించారు

గతేడాదితో పోల్చితే రూ.27 కోట్లు అధికం

న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు



దసరా పండుగ నేపథ్యంలో ఈ ఏడాది మద్యం వ్యాపారం భారీగా జరిగింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతేడాది దసరా వేడుకలకు రూ.139 కోట్ల వ్యాపారం సాగగా, ఈ ఏడాది రూ.166 కోట్లు వ్యాపారం సాగిందని అధికారులు పేర్కొన్నారు. గతేడాదితో పోల్చితే రూ.27 కోట్ల అధికంగా జరిగిందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్సైజ్ శాఖ నిర్దేశించిన లక్ష్యం రూ.165 కోట్లు దాటిపోయింది. మొత్తం 292 మద్యం దుకాణాలతోపాటు 54 బార్ల ద్వారా విక్రయాలు జరిగాయి.

ఎక్కువగా కరీంనగర్‌లో..

జిల్లా	మద్యం దుకాణాలు	వ్యాపారం రూ.కోట్లలో
కరీంనగర్	94	46
పెద్దపల్లి	77	39
జగిత్యాల	63	41
సిరిసిల్ల	48	34

కరీంనగర్ కాకుండా పెద్దపల్లి జిల్లాలోని కార్మిక క్షేత్రం గోదావరిఖనిలో మద్యం వ్యాపారం ఎక్కువ సాగుతోంది. జనాభా ప్రాతిపదికన ఈ ప్రాంతాల్లో వ్యాపారం ఎక్కువగా ఉంటుందని అధికారులు భావించారు. ఈ ఏడాది ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 రోజుల ముందుగానే దసరా లక్ష్యాన్ని విధించి.. పూర్తి చేయాలని ఆదేశించింది. మద్యం దుకాణాల ద్వారా కాకుండా ఉమ్మడి జిల్లాలో ఉన్న 54 బార్ల ద్వారా మరో రూ.6 కోట్ల వ్యాపారం సాగింది.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. వరి కోతలు ప్రారంభమై ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినప్పటికీ ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో పలువురు రైతులు తక్కువ ధరకు దళారులకు విక్రయించి నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం త్వరగా ప్రారంభించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ముస్తాబాద్ కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

నేర వార్తలు

అడవంతా గాలించి... నిందితుడి పట్టివేత

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్‌తండాలో గిరిజన మహిళ హత్య కేసులో నిందితుడిని ఎల్లారెడ్డిపేటలో సీఐ శ్రీనివాస్ అరెస్టు చేసినట్లు ఎస్సై ఎల్లయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు... జవహర్‌లాల్‌నాయక్‌తండాకు చెందిన గుగులోతు రవి స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సుశీలపై అనుమానం పెంచుకుని తరచూ వేధింపులకు పాల్పడేవాడు. ఈ నెల 12న రాత్రి లైంగిక సంపర్కానికి సహకరించకపోవడంతో ఆమెను తాడుతో గొంతు నులిమి హత్య చేశాడు. ఇంటి బయటకు మృతదేహాన్ని తీసుకువచ్చి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు చూశాడు. పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆరు బయట మంచంపై సుశీల మృతదేహాన్ని వదిలి తలుపులకు గడి పెట్టి అడవిలోకి పారిపోయాడు. సంఘటన స్థలంలో హత్యకు ఉపయోగించిన తాడును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

మూడు బృందాలతో...

భార్యను హతమార్చిన తర్వాత రవి తప్పించుకునేందుకు అడవిలోకి వెళ్లాడు. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు అడవంతా గాలించారు. అటవీ సరిహద్దు గ్రామాలపై పోలీసులు నిఘా పెంచారు. పశువుల కాపర్ల సాయంతో నిందితుడి కదలికలను గుర్తించారు. పక్కా సమాచారం మేరకు గుట్టపై సేదతీరుతున్న రవిని ఆదివారం రాత్రి పట్టుకుని ఎల్లారెడ్డిపేటకు తరలించారు. ఎస్సై ఎల్లయ్యతోపాటు గాలింపు చర్యల్లో పాల్గొన్న పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

వరి ధాన్యం కుప్ప ఎక్కి కిందపడ్డ వాహనదారుడు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రంపేటకు చెందిన వేముల రాజశేఖర్ ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై సర్దాపూర్‌లోని పెట్రోల్ బంక్‌లో పని నిమిత్తం వెళ్లి తిరిగి రగుడు-వెంకటాపూర్ బైపాస్ రోడ్డు నుంచి గ్రామానికి వస్తున్నాడు. చీకట్లో బోనాల, చిన్నబోనాల పరిసర ప్రాంతంలోని బైపాస్ రోడ్డుపై ఉన్న వడ్ల కుప్పను ఎక్కించడంతో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు తీవ్ర గాయాలు కాగా సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. రోడ్డుపై ధాన్యం పోసిన చిన్నబోనాలకు చెందిన సరుగు భాస్కర్‌పై బాధితుడి సోదరుడు వేముల రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కృష్ణ తెలిపారు. నిత్యం వాహనాలు తిరిగే రోడ్లపై ధాన్యంను ఆరబెట్టడం వల్ల రాత్రి సమయాల్లో గ్రహించక ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్లపై ధాన్యం ఆరబెట్ట వద్దని సూచించారు.

బెదిరించి డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్టు

వేములవాడ, న్యూస్‌టుడే: బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన వొటకారి మధు పట్టణంలోని మొదటి బైపాస్ రహదారిలో సొంత భూమిలో ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నించగా, గాంధీనగర్‌కు చెందిన కొండ్లెపు ముత్యం ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పిస్తానని నమ్మించి మధు వద్ద రూ.59 వేలు తీసుకున్నాడు. చాలా రోజులు గడిచినప్పటికీ ఇంటి నిర్మాణానికి అనుమతి ఇప్పించలేదు. దీంతో మధు సొంతంగా మున్సిపల్ నుంచి ఇంటి అనుమతి పొంది నిర్మాణ పనులు చేపట్టగా ముత్యం మధు వద్దకు వచ్చి రూ. 2 లక్షలు ఇవ్వాలని, లేకుంటే ఇల్లు కట్టనివ్వనని మధును, అతని కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించాడు. భయపడిన మధు రూ.50 వేలు ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ముత్యంపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

పోలీసు విధులకు ఆటంకం... ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: మండలంలోని పెద్దలింగాపూర్‌లో దుర్గామాత నిమజ్జనం బందోబస్తులో పోలీసుల విధులను ఆటంకం కలిగించిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఆదివారం రాత్రి దుర్గామాత నిమజ్జనంలో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్‌ను నెట్టేసి అమర్యాదగా మాట్లాడి విధులకు ఆటంకం కలిగించిన అదే గ్రామానికి చెందిన గుర్రాల సంతోష్, సుమన్‌రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అడ్డుగా వెళ్లిన ఒకరిపై దాడి

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌లో దుర్గాదేవి నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాల మధ్య స్వల్ప వివాదం తలెత్తగా అడ్డుగా వెళ్లిన ఒకరిపై దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భగవంతరావునగర్‌లోని రెండు ప్రాంతాల్లో దుర్గాదేవి మండపాలను ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో వీరి మధ్య స్వల్ప వివాదం ఏర్పడగా, అడ్డుగా వెళ్లిన పెంజర్ల కుమార్‌పై దాడి చేశారు. దీంతో అతనికి గాయాలు కాగా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు.

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రం శివారులో మానాలకు వెళ్లే దారిలో మల్లన్న ఆలయం సమీపంలో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మానాల నుంచి రుద్రంగి వైపు కారు వచ్చే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ప్రమాద సమయంలో కారులో ఒక్కరే ఉన్నారు. గాయాలు ఏమీ కాలేదు.

గుండెపోటుతో యువకుడి మృతి


జంగపల్లి బాబు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన జంగపల్లి బాబు (27) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జంగపల్లి శ్రీనివాస్, ఎల్లవ్వ దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు బాబు (27) గ్రామంలోనే ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. సోమవారం పనికి వెళ్లి ఇంటికి వచ్చిన బాబు ఛాతిలో నొప్పి వస్తుందని ఒక్కసారిగా ఇంట్లో కుప్పకూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వారు తెలిపారు.

అంత్యక్రియలకు రూ.20 వేలు అందజేత

ముస్తఫనగర్(గంభీరావుపేట), న్యూస్‌టుడే: గంభీరావుపేట మండలంలోని ముస్తఫనగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త భారతమ్మ దసరా రోజున గుండెపోటుతో మృతి చెందింది. అంత్యక్రియల కోసం మృతురాలి కుటుంబానికి కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం రూ. 20 వేలు పంపించగా సోమవారం సీడీపీవో ఉమారాణి అందజేశారు.

అధికారుల నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ప్రమాదం



కోనరావుపేట మండల కేంద్రం శివారులో లోలెవల్ కల్వర్టు వాహనదారులు, ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. మల్కపేటలో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల రిజర్వాయర్ ఎడమ కాలువ డిస్ట్రిబ్యూటరీ నుంచి లీకేజీ నీటితో ఏడాదంతా పారుతోంది. రెండు వరుసల తారు రోడ్డులోని లోలెవల్ కల్వర్టుపై నుంచి పారడంతో సీసీ చెదిరి పెద్ద గుంత ఏర్పడింది. నీటిలో గుంత కనిపించక వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. నిత్యం మండల అధికారులు ఈ మార్గంలో కార్యాలయాలకు వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కోనరావుపేట**

కోనోకార్పస్ మొక్కలు తొలగించండి

సిరిసిల్ల పట్టణంలో కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట ప్రధాన రహదారిలో డివైడర్ల మధ్యలో ఉన్న కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. వీటి వల్ల శ్వాసకోశ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నందున వాటిని తొలగించి, వాటి స్థానంలో అందమైన పూల మొక్కలు పెంచాలని వేడుకుంటున్నారు. **-న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్**




రహదారి అధ్వానం

సిరిసిల్ల పట్టణంలో సాయినగర్‌లోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. సమీపంలో ఇసుక రీచ్ ఉండటంతో ఈ మార్గంలో వందలాది ఇసుక ట్రాక్టర్లు రాకపోకలు సాగించడంతో అధ్వానంగా తయారైంది. సమీపంలోని కాలనీవాసులు రహదారి వైపు రావాలని జంకుతున్నారు. ఏ క్షణంలో ఎటువైపు నుంచి ట్రాక్టర్లు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. దుమ్ము, ధూళితో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఇసుక రీచ్‌ను మరో చోటుకు మార్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్



కనుల పండువగా అమ్మవారి శోభాయాత్ర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వీర్నపల్లి, న్యూస్‌టుడే: వీర్నపల్లి మండల కేంద్రంలో సోమవారం శరన్నవరాత్రుల వేడుకలు ఘనంగా ముగిశాయి. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారిని అలంకరించిన రథంలో పురవీధుల గుండా ఊరేగించారు. భక్తి పాటలకు యువతీ, యువకులు నృత్యాలు చేశారు. పంచామృతాలతో అభిషేకించిన అనంతరం వెంకట్రాయిని చెరువులో నిమజ్జనం చేశారు.


వీర్నపల్లిలో నృత్యం చేస్తున్న చిన్నారులు

రైతులు, స్థానిక సమస్యల పరిష్కారానికి వినతి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండలంలో వరి కోతలు ప్రారంభమవగా కొనుగోలు కేంద్రాలతో పాటు స్థానికంగా ఉన్న కొన్ని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఒగ్గు బాలరాజుయాదవ్ ఆధ్వర్యంలోని రైతులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం, శ్రీలక్ష్మీకేశవపెరుమాండ్ల ఆలయం, కిష్టంపల్లిలో పీఏసీఎస్‌ల ద్వారా గతంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు 40 కిలోలకు బదులుగా 42.50 కిలోలు తూకం వేయడం ద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం 41 కిలోలు మాత్రమే తూకం వేయించాలన్నారు. అకాల వర్షాలకు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. పత్తి విక్రయాలకు ఎల్లారెడ్డిపేటలోనే సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని నెలకొల్పాలని పేర్కొన్నారు. గిద్దె చెరువును మినీ ట్యాంకుబండ్‌గా మార్చేందుకు భారీ ఎత్తున నిధులు మంజూరవగా కొన్ని నిర్మాణాలను మాత్రమే పూర్తిచేశారని, దీనిపై ఉన్నతాధికారులతో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీకాంత్, నర్సయ్య, రవీందర్‌రెడ్డి, నర్సింలు, నరేందర్‌గౌడ్, నిమ్మ శ్రీనివాస్, సతీశ్‌యాదవ్, రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

రాజన్నను దర్శించుకున్న పీఏసీ ఛైర్మన్

వేములవాడ: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామిని సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ అరికెపూడి గాంధీ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదాశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

స్వచ్ఛదనం- పచ్చదనంపై కళా ప్రదర్శన

సింగారం (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనంపై సోమవారం కళా ప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక సారథి ఎడమల శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలోని కళాకారులు చెట్లతో కలిగే లాభాలు, ప్లాస్టిక్ కవర్ల వినియోగంతో అనర్థాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు.


గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్‌లో సోమవారం 2008-09 ఏడాది పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పాఠశాలలో చదువుకున్నప్పటి తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, రైతుల సమస్యలపై పోరాటం

బోయినపల్లి, న్యూస్‌టుడే: కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ తెలిపారు. బోయినపల్లిలో సోమవారం సీపీఎం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవంబరు 3, 4 తేదీల్లో మండల కేంద్రంలో పార్టీ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు అశోక్, రవి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న శ్రీధర్

ఉపాధ్యాయ కొలువు సాధించిన యువకుడికి సన్మానం

మరిమడ్ల (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన కలకుంట్ల రవి తెలుగు పండిట్ ఉపాధ్యాయ కొలువు సాధించాడు. గ్రామస్థులు, యువకులు సోమవారం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో దిలీప్‌కుమార్, సుధాకర్, రాజేందర్, పి.మల్లేశం, అనూక్, శ్రీనివాస్, శేఖర్, శంకరయ్య, భీమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


రవిని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఉద్యోగాలకు ఎంపికైన వారికి...

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల నిర్వహించిన పలు పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు పొందిన వారిని రుద్రంగి స్పోర్ట్స్ క్లబ్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్ఎస్‌బీలో ఎస్సైగా అంబటి సాగర్ ఎంపిక కాగా, లింగంపల్లి రవి, గడప వేణు, శీలం మానస, తర్రె సంగీతలు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి సోమవారం వేర్వేరుగా సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు గంగం మహేశ్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రికి ...

వేములవాడ: రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం రాజన్న ఆలయ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి శాలువాతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 నాణెం తీసుకోవాలి

బోయినపల్లి, న్యూస్‌టుడే: వినియోగదారుల నుంచి ప్రతి వ్యాపారి రూ.పది నాణెం తీసుకోవాలని యూనియన్ బ్యాంకు క్యాషియర్ వాసు సూచించారు. బోయినపల్లిలోని పలు దుకాణ సముదాయాల్లో సోమవారం బ్యాంకు మేనేజర్ మహేందర్ ఆదేశాల మేరకు రూ.పది నాణేల వినియోగంపై అవగాహన కల్పించారు. అనేక మంది వ్యాపారులు తిరస్కరిస్తున్నారని, అలా చేయకూడదన్నారు.

నేటి నుంచి శివకేశవుల బ్రహ్మోత్సవాలు

ముస్తాబాద్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని శివకేశవుల ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ ఛైర్మన్ ఎల్లాని దేవయ్య తెలిపారు. ఈ నెల 16న శ్రీపద్మావతి-వేంకటేశ్వరస్వామి, పార్వతి-పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17న రథోత్సవం జరుగుతుందని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాద్‌లో ఆలయం వద్ద కమిటీ ఛైర్మన్, సభ్యులు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో రెడ్డి ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ డైరెక్టర్లను సోమవారం ఘనంగా సన్మానించారు. వైస్ ఛైర్మన్ గుండాడి రాంరెడ్డి, డైరెక్టర్లు కొంగరి కిష్టారెడ్డి, ముత్యాల సత్యంరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, మర్రి నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డిలను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెపా కన్వీనర్ మోతె దేవరెడ్డి, కో కన్వీనర్ ముత్యాల వెంకట్‌రెడ్డి, సభ్యులు బాల్‌రెడ్డి, ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు గిరిధర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన డైరెక్టర్లతో రెపా సభ్యులు

మహిళా సంఘాల సభ్యులకు కోడిపిల్లల పంపిణీ

హరిదాస్‌నగర్ (ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని మహిళా శక్తి పథకంలో భాగంగా శ్రీకాంత్ బ్యాక్ పౌల్ట్రీ మదర్ యూనిట్ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు సోమవారం కోడిపిల్లలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డీఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో అర్హులైన సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలతో కోడి పిల్లలను పంపిణీ చేశామని తెలిపారు. ఈ పథకంతో మహిళలు స్వయం ఉపాధి పొంది, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఎంటర్‌ప్రైజెస్, అకౌంటింగ్, మహిళా శక్తి పథకాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంలు పద్మయ్య, సుధారాణి, ఏపీఎం మల్లేశం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, వీవో అధ్యక్షురాలు పద్మ, సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.


కోడిపిల్లల పంపిణీలో అదనపు డీఆర్డీవో శ్రీనివాస్, డీపీఎం పద్మయ్య

పెంటివాగు కల్వర్టుకు మరమ్మతులు

కొండాపూర్ (కోనరావుపేట), న్యూస్‌టుడే: కోనరావుపేట మండలం కొండాపూర్-వెంకట్రావుపేట మధ్య ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెంటివాగు కల్వర్టు పైపులైను కోతకు గురైంది. దీంతో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర వాహనాల రాకపోకలు నిలిచాయి. సమస్యను ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. కోతకు గురైన కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. స్పందించిన కాంగ్రెస్ నాయకులు బండ సత్తయ్య, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, బక్కయ్య, లింగారెడ్డి, వేణు తిరుపతి, బాబు, అంజయ్యలు తమ ట్రాక్టర్ల సహాయంతో గ్రావెల్ తరలించి చదును చేయించారు. దీంతో భారీ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి.


మరమ్మతులు చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో మహిళలు ఆడి పాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రుద్రంగిలో ఏటా దసరా తర్వాత బతుకమ్మ వేడుకలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది.

ఆస్ట్రేలియాలో...

వేములవాడ: ఆస్ట్రేలియాలోని వియన్నా నగరంలో సోమవారం ప్రవాస భారతీయులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు. తెలంగాణ ప్రాంత ఆడ పడుచులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి భక్తి శ్రద్ధలతో గౌరమ్మకు పూజలు చేసిన అనంతరం ఆడి పాడారు.


రుద్రంగిలోని రామకృష్ణాపూర్ పల్లెలో...


ఆస్ట్రేలియాలో ప్రవాస భారతీయులు


రుద్రంగిలో...

మధ్యమానేరులో 26.53. టీఎంసీల నీరు

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర జలాశయానికి ఎస్సారెస్పీ నుంచి 520 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. జలాశయం నుంచి దిగువన ఎల్ఎండీకి 330 క్యూసెక్కులు వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.53 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నివేదన సమయాన్ని నిలిపివేసి దేవాదాయశాఖ మంత్రి ధర్మం పట్ల విశ్వాసం లేకుండా స్వామివారిని దర్శనం చేసుకోవడం ఆగమశాస్త్రానికి విరుద్ధమని భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. మంత్రి నిబంధనలు ఉల్లంఘించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. దీనిపై అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు సంతోష్‌బాబు పాల్గొన్నారు.